క్లుప్తంగా

వరాహావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు వరహావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఐటీఐలో 2 నుంచి బ్రిడ్జి కోర్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన బ్రిడ్జి కోర్సు వచ్చే నెల రెండో తేదీన ప్రారంభం కానుంది. ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 94946 88516 నంబరులో కూడా సంప్రదించవచ్చని సూచించారు.

పోషకాల గని గుడ్డు



గుడ్లు పంపిణీ చేస్తున్న సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్: కోడిగుడ్డులో అనేక పోషకాలు ఉన్నందున వాటిని సూపర్ ఫుడ్డుగా ప్రతి ఒక్కరు రోజు తీసుకోవాలని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు గుడ్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్డులో 13 ముఖ్యమైన విటమిన్లు ఉన్నాయన్నారు. విటమిన్ ఏ, ఈ, బి5, బి12, ఐరన్, అయోడిన్, ఫాస్ఫరస్ వంటివి ఉన్నాయని అన్నారు. ప్రకృతి ప్రసాదించిన గుడ్డు సూపర్ ఫుడ్ అని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, రాఘవరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



చినమామిడాడ చర్చిలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

కరప: మండలం కూరాడ శివారు చినమామిడాడలోని ఎన్‌టీసీ చర్చిలో మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పాస్టర్ పి.జయబాబుతో కల్సి ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి, 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సత్తిబాబు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.ప్రకాష్, చర్చి ప్రతినిధులు పి.జయమణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌చే మహిళలకు ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: ఈ నెల 29వ తేదీ శుక్రవారం కాకినాడ గాంధీనగర్‌లో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో మహిళలకు ప్రథమ చికిత్స, ఆరోగ్య పరిరక్షణ సూత్రాలు, ఇంట్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై ఒక రోజు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వ్యక్తిగతంగా కార్యాలయంలో కానీ లేదా 0884 2371409 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

సర్వశిక్ష ఉద్యోగుల ఆందోళన

కాకినాడ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే సర్వశిక్ష కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనం చెల్లించాలని ఉద్యోగులు మంగళవారం కాకినాడలో బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో ఏజేసీ జిల్లా అధ్యక్షుడు ఎం చంటిబాబు, కార్యదర్శి నాగమణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన ప్రకారం మండలంలోని పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన వాసంశెట్టి మధు సారా విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో దాడి చేసి అతడిని అరెస్టు చేసి తన వద్ద నుంచి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తిదాయకం

- సంక్రాంతికి ముందే పెద్ద సంబరం
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వాకలపూడిలో ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన జేసీ ఇలక్కియ



వాకలపూడిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతితో వస్తున్న క్రీడాకారిణులు



కరప హైస్కూలులో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కాకినాడ రూరల్: ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను వాకలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలసి ఆయన ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను జేసీ, రాష్ట్ర క్రీడల జెండాను 'ఆడుదాం ఆంధ్రా' శాప్‌కు చెందిన హర్షవర్దన్ రెడ్డితో కలసి ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. క్రీడా జ్యోతిని జేసీ ఇలక్కియతో కలసి వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ సంక్రాంతికి ముందే అతిపెద్ద క్రీడా సంబరం ప్రారంభమైందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ క్రీడలను ప్రతిష్టాత్మకంగా చేట్టారన్నారు. ఇందుకోసం జిల్లాలో సుమారు లక్ష మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రైజ్‌మనీ గెలుచుకోవాలని కన్నబాబు ఆకాంక్షించారు. ఫిబ్రవరి 10 వరకు సుమారు 47 రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి ఐదు క్రీడలు నిర్వహిస్తున్నారని, విజేతలకు రూ.12 కోట్లు వరకు నగదు పురస్కారాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, హెచ్ఎం సూర్యనారాయణమూర్తి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ భవాని, గొల్లపల్లి జగన్, విజయసారధి, కరీం బాషా, నల్ల రాణి, జి.సత్యనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో దేహ దారుఢ్యం

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడలను పండగలా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ ఆటల వల్ల శరీర దారుఢ్యంతో పాటు, మానసికోల్లాసం కలుగుతాయని అన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 7,033 మంది క్రీడలకు రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. వచ్చే నెల ఆరో తేదీ నుంచి మండలస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ముందుగా కాకినాడ హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు ఎం.రామరాజు, సీహెచ్ ఈశ్వరరావు, ఎంకేవీఎస్ రాజులు విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మెడిటేషన్, యోగా నిర్వహించి అనంతరం క్రీడలను ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన టి.దుర్గాదేవి, యస్మిత, బి.పావని చంద్రిక, సత్యప్రణీత్‌లను సత్కరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం జెడ్పీటీసీ సుబ్బారావు బ్యాటింగ్, ఎంపీపీ శ్రీలక్ష్మి బౌలింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.అప్పారావు మండలంలో నిర్వహిస్తున్న క్రీడలను పర్యవేక్షించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, దేవిశెట్టి సూర్యప్రకాష్, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

దూరదృష్టితో సచివాలయ వ్యవస్థ

ఎంపీ వంగా గీత



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే దూరదృష్టితో సీఎం జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఎంతో ప్రయోజనాన్నిస్తోందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. కొండయ్యపాలెంలో రూ.50 లక్షలతో ప్రతిపాదించిన సచివాలయం, కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో కలసి ఆమె మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దారన్నారు. సచివాలయంతో పాటు డ్వాక్రా మహిళల కోసం కమ్యూనిటీ హాలును కూడా నిర్మించామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు కర్రి శైలజ, బాలా ప్రసాద్, నల్లబెల్లి సుజాత, స్థానిక నాయకులు వాకాడ సత్తిబాబు, కర్రి అనంతలక్ష్మి, కె.చంద్రవంశీ, తిరుమలశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరాధ్యుడు వంగవీటి

రంగా వర్ధంతి సభలో ఎంపీ గీత



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: దివంగత వంగవీటి మోహన రంగా అన్ని వర్గాలకు ఆరాధ్యుడని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. రంగా 35వ వర్ధంతిని స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన కాంస్య విగ్రహానికి ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సమస్యలపై పోరాడిన రంగ స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారన్నారు. అందువల్లే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, ఆయన పోరాట స్ఫూర్తితో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రంగా స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. రంగా భావాలు, ఆశయ స్ఫూర్తి తనను ఎంతగానో ఆకర్షించాయని, 35 ఏళ్ల క్రితం జరిగిన రంగ హత్య అత్యంత దురదృష్టకరమన్నారు. రంగా ఆత్మకు శాంతికలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, కర్రి శైలజ, కంపర బాబి, స్థానిక నాయకులు గూటాల రామకృష్ణ, కత్తిపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకోవాలి



నడకుదురులో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన దాతలు

కరప: మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రితో ముగిసాయి. నడకుదురులోని సీఎండీసీ క్రైస్ట్ బిలీవర్స్ చర్చిలో మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్, రెవరెండ్ ఫాదర్, మేడపాటి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఫాదర్ రాజ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి, కేక్ కట్ చేసి అందరికీ పంచారు. క్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకుని, ప్రేమ, వాత్సల్యం, అనురాగం అందరికీ పంచాలని కురసాల పేర్కొన్నారు. ఎమ్మెల్యేను చర్చి పెద్దలు సత్కరించారు. చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో సైతం క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్రీస్తు బోధనలు మార్గదర్శకం

కాకినాడ రూరల్: క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమని సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేట దండుపుంత ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రిస్మస్ ప్రపంచ పండుగ అన్నారు. ప్రతి ఒక్కరు కరుణ, ప్రేమ, శాంతి మార్గంలో నడవాలని తెలిపారు. క్రీస్తు బోధనలను అనుసరించి ప్రతి ఒక్కరు పొరుగు వారిని ప్రేమ తత్వంతో ఆదరించాలని పేర్కొన్నారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పాస్టరమ్మ ఎలిజిబెత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటరమణ, రాఘవరావు పాల్గొన్నారు.

'కూచిపూడి వసంతం'తో నాట్యానికి మెరుగులు



కూచిపూడిలో మెళకువలు నేర్పుతున్న వసంత కిరణ్

- నాట్యాచార్యుడు వసంత కిరణ్
- 'నృత్యాంజలి' ఆధ్వర్యంలో శిక్షణ

బోట్‌క్లబ్: శాస్త్రీయ నృత్యం కూచిపూడిలో రాణించాలంటే పలు మెళకువలు చేర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని కర్ణాటకకు చెందిన ప్రముఖ కూచిపూడి, భరత నాట్యాచార్యుడు, కేంద్ర బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ గ్రహీత వసంత కిరణ్ అన్నారు. నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లోని రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో కూచిపూడి వసంతం పేరిట ప్రత్యేక శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభించారు. నృత్యాంజలి అధినేత హరిలోకేష్ శర్మ, కృష్ణవేణిల పర్యవేక్షణలో జరుగుతున్న జాతీయ స్థాయి శిబిరంలో వివిధ రాష్ట్రాల ప్రముఖ నట్యాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిలోకేష్ మాట్లాడుతూ ఈ నెల 28 వరకూ శిబిరం ఉంటుందన్నారు. ఈ శిబిరంలో నాట్యానికి పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా అడుగులు, జతులు, కీర్తనలకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సంగీతం, ఆహార్యం, అలంకరణ వంటి అంశాల్లో నిపుణులచే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. యువ నాట్యాచార్యులు హరిగురు శరవణ్, గణేష్ హరిహరన్, మల్లికార్జునరావు, పవన్‌కుమార్‌ల నిర్వహణలో సుమారు వంద మంది నాట్య విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. జాతీయ శిక్షణ శిబిరంలో కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఏపీకి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు వివిధ అంశాల్లో విద్యార్థులు, కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు.

విలువైన స్థలాలకు హక్కు కల్పించాం



సుందరయ్యకాలనీ వాసులకు హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామం సుందరయ్య కాలనీలో 20 ఏళ్ల సమస్యకు మోక్షం కల్పించాం. విలువైన స్థలాలకు హక్కు కల్పించామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గ్రామంలోని సుందరయ్యకాలనీలో మంగళవారం సాయంత్రం పొజిషన్ సర్టిఫికెట్లను మంగళవారం ఎమ్మెల్యే కన్నబాబు పంపిణీ చేశారు. గ్రామ నాయకుడు, జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 89 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ మురార్జీ సమక్షంలో పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం విలువైన స్థలాల్లో ఎవరైతే ఉంటున్నారో వారందరికీ శాశ్వత హక్కు కల్పించేలా పొజిషన్ పట్టాలు ఇచ్చామన్నారు. ఒక హక్కుగా, ఆస్తిగా అనుభవించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదల పక్షాన నిలిచి సంక్షేమ కార్యక్రమాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, సుందరయ్య కాలనీ పట్టాల కోసం జెడ్పీటీసీ రామకృష్ణ కృషి చేశారన్నారు. జడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ పాలనలో పేదలకు అన్ని విధాలా లబ్ధి చేకూరుతుందని, ఎమ్మెల్యే కన్నబాబు సహకారంతో సుందరయ్య కాలనీ వాసులకు ఎన్నో ఏళ్లగా సమస్యగా ఉన్న పట్టాలు పంపిణీ కొలిక్కి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైఎస్సా సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లెయిముల సత్వర పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లెయిముల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే కార్యక్రమం మరింత వేగవంతంగా చేపట్టినట్టు వివరించారు. ఓటరు జాబితాపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ)తో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 30న శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో 12 అంశాలను పొందుపర్చినట్టు తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కోడిపందాల స్థావరంపై దాడి

పిఠాపురం: పోలీసులకు అందిన సమాచారంతో మండల కేంద్రమైన కొత్తపల్లి శివారులో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,400 నగదు, కోడిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేశారు.

ఆడండి... గెలవండి...

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- మూడు అంశాల్లో మహిళలకు పోటీలు
- పోటీలలో 30 వేల మంది మహిళలు
- రూ.35 లక్షల విలువైన బహుమతులు
- జనవరి 10 వరకు నిర్వహణ



విజేతలకు ఇచ్చే బహుమతులను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మహిళల్లో సంక్రాంతి సందడి ముందే మొదలైంది. కాకినాడ ఇందుకు వేదిక కాబోతుంది. ప్రతి మహిళ ఇంట సంతోషం వెల్లివిరిసేలా 15 రోజుల పాటు మహిళలకు క్రీడా పోటీలను తలపెట్టారు. జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విస్తృత ఏర్పాట్లు చేశారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు సచివాలయాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఫైనల్స్‌లో ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ వంటి ఖరీదైన బహుమతులు ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.35లక్షలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

నేటి నుంచి పోటీలు ప్రారంభం


నియోజకవర్గ పరిధిలోని మహిళలకు మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలు జనవరి 10వ తేదీతో ముగియనున్నాయి. రోజూ నాలుగు డివిజన్ల చొప్పున ఈ పోటీలను నిర్వహిస్తారు. విజేతలకు జనవరి పదో తేదీన ఆనందభారతి మైదానంలో జరిగే గ్రాండ్ ఫైనల్స్‌లో బహుమతి ప్రదానం చేయనున్నారు. కాగా కాకినాడలోని 44 డివిజన్లకు సంబంధించి ప్రతి డివిజన్‌కు ప్రతి రోజు 18 బహుమతులను మహిళలు అందుకోనున్నారు. టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ పోటీలను ఉదయం 9 నుంచి 1 గంట వరకు, ముగ్గుల పోటీలను మధ్యాహ్నం 2 నుంచి నిర్వహించేందుకు నిర్ణయించారు.

నేటి నుంచి సంబరాలు

కాకినాడ సిటీ: పనుల వత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు కాకినాడ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహిళలకు జగనన్న సంక్రాంతి సంబరాలు ఆడండి–గెలవండి పేరిట పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత తెలిపారు. మంగళవారం డి–కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో ముగ్గులు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. 4–13 డివిజన్ల వరకు ఒక క్లస్టర్, 14–26 డివిజన్లు, 27–37 డివిజన్లను, 38–47 డివిజన్లను క్లస్టర్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతి వార్డు సచివాలయ పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని, వీటితో పాటు జట్ల వారీ పాల్గొనే వారికి వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికీ ఒక బహుమతి ఉంటుందన్నారు. మొదటి బహుమతిగా రూ.26 వేలు విలువైన వాషింగ్ మిషన్, రెండో బహుమతిగా రూ.18 వేలు విలువైన ఫ్రిజ్, మూడో బహుమతిగా రూ.16 వేలు విలువైన ఎల్‌ఈడీ టీవీ అందిస్తామన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ నగరానికి 20 రోజులు ముందుగానే సంక్రాంతి రావడం అభినందనీయమన్నారు. సంక్రాంతి పండుగ సమయాల్లో సాధారణంగా మగవారికి అనేక రకాల ఆటలు ఉంటాయని, కానీ ఈ సారి మహిళలకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జగనన్న సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. మహిళల ఆశీస్సులు ఆయనకు పూర్తి స్థాయిలో ఉంటాయని గీత అన్నారు. ఈ సందర్భంగా రూ.35 లక్షల విలువైన బహుమతులను ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పండుగ వాతావరణం కోసమే...



సంక్రాంతి పండుగ సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించాలనే ఉద్దేశంతో 15 రోజులపాటు జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట పోటీలు నిర్వహిస్తున్నాం. మొత్తం 84 సచివాలయాల పరిధిలో ఈ పోటీలు జరుగుతాయి. ఆసక్తి కలిగిన మహిళలు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. స్థానికంగా ఉండే నాయకులు, కార్యకర్తలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ మొత్తం మీద దాదాపు 30 వేల మంది పోటీలలో పాల్గొంటారని అంచనా.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ